

రేపు బెంగళూరుకు తెలంగాణ సీఎం

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి విషయంలో కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బెంగళూరులో బుధవారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్యతోపాటు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలుస్తోంది. ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయాల ధన సహాయ కమిషన్ వెలువరించిన నియమావళి గురించి నగరంలోని ఐటీసీ విండ్సర్ మానర్ హోటల్‌లో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నారు.



అప్పుల్లో.. అగ్రస్థానం..!





- రోజురోజుకూ పెరిగిపోతున్న రాష్ట్ర రుణాలు
- రాష్ట్ర జనాభా 6.8 కోట్లు - అప్పులు రూ.6.65 లక్షల కోట్లు
- తడిసి మోపెడైన వడ్డీ
- ప్రతి కన్నడిగుడిపై రూ.లక్ష అప్పు మోపారు
- కాంగ్రెస్‌పై బీజేపీ మండిపాటు

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): దేశంలో ఎన్నో విభాగాలకు మార్గదర్శకంగా ఉండే కర్ణాటక రాష్ట్రం అప్పుల్లోనూ రికార్డు సృష్టిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ అప్పుల భారం ఇప్పటికే 6 లక్షల కోట్ల రూపాయలు దాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి 31లోగా కనీసం రూ.60 వేలకోట్లు అప్పులు చేసే అవకాశం ఉంది. దీన్నిబట్టి ఆర్థికసంవత్సరం ముగిసేసరికి రాష్ట్రప్రభుత్వ అప్పులు 6.65 లక్షల కోట్లకు చేరే అవకాశం ఉంది. దేశంలో ఒక్కో పౌరుడి మీద రూ.లక్ష అప్పు ఉన్న రాష్ట్రం కర్ణాటకనేనని పలువురు ఆర్థిక వేత్తలు అభిప్రాయ పడుతున్నారు. ఏటా అప్పులు పెరుగుతూనే ఉన్నాయి. అభివృద్ధి, సంక్షే మం కోసం అంటూ చేస్తున్న అప్పులకు వడ్డీ మోయలేనంతభారంగా మిగులుతోంది.

మోయలేనంత వడ్డీ భారం

ఏటా రికార్డుస్థాయిలో బడ్జెట్‌ను పెంచుకుంటున్న ప్రభుత్వం రుణం కూడా అదే స్థాయిలో పెరుగుతోంది. 2024-25 ఆర్థికసంవత్సరంలో 1.05 లక్షల కోట్లు అప్పు చేసేందుకు అవకాశం ఉంది. దీన్నిబట్టి 2025-26లో అంతకంటే ఎక్కువ అప్పు చేసేందుకు అవకాశం చేసుకుంటారు. సీఎం సిద్దరామయ్య ఆర్థికమంత్రిగా 2024-25 సంవత్సరానికి సంబంధించి రూ.3.71 లక్షల కోట్ల మేర బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. జీఎస్‌డీపీ దాదాపు 1.05 లక్షలకోట్లు రుణం పొందేందుకు అవకాశం పెట్టుకున్నారు. ఇంత భారీగా అప్పులు చేసి అభివృద్ధి పనులు, పెట్టుబడులు పెంచుకునేందుకు లేదా శాశ్వతమైన సాగునీటి పథకాలు పూర్తి చేశారంటే అర్థవంతంగా ఉంటుంది. కానీ బడ్జెట్‌లో 59శాతం అంటే 62,552 కోట్ల రూపాయలు వడ్డీలకే చెల్లించాల్సి వస్తోంది.

ఈ ఆర్థిక సంవత్సరంలోనే

₹59 వేల కోట్ల రుణం

ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.59వేల కోట్లు అప్పు చేసింది. గత సెప్టెంబరు చివరినాటికి రూ.7349 కోట్ల రూపాయలు మాత్రమే అప్పు చేశారు. అప్పులకు వడ్డీ చెల్లించాల్సి రావడంతో ఆర్థికసంవత్సరంలో మూడో, నాల్గో త్రైమాసికంలో ఎక్కువరుణం పొందాల్సి వస్తోంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో 1.05 లక్షల కోట్ల రూపాయలదాకా అప్పు చేసే వెసలుబాటు ఉన్నా రూ.95 వేల నుంచి లక్ష కోట్ల దాకా రుణం పొందే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధితోపాటు ప్రజలకు సేవ, సంక్షేమ పథకాలు కొనసాగించేందుకు సొంత పన్నులను క్రోడీకరించుకోవడంతోపాటు అప్పులు చేస్తోంది. జీడీఎస్‌డీపీ ప్రమాణం పెరుగుతున్న తరహాలోనే అప్పులు పొందే మితి కూడా పెరుగుతోంది. తద్వారా వడ్డీ చెల్లింపులకు భారీగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉంటుంది.

2023-24 ఆర్థికసంవత్సరం నాటికి 5,81,228 కోట్ల రూపాయలు అప్పుగా ఉండేది. 2024-25 నాటికి 6,65,095 కోట్లకు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుత సంవత్సరం వడ్డీతోపాటు రుణాల కంతుల చెల్లింపులకోసం 62,552 కోట్ల రూపాయలు దాదాపు ఖర్చు చేయాల్సి ఉంది. ఇందులో కంతులరూపంలో చెల్లించాల్సిన రూ.25,228 కోట్లు కాగా, వడ్డీ 37,324 కోట్ల రూపాయలుగా ఉంది. వచ్చే ఏడాది ఏకంగా 35శాతం వడ్డీకి చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడనుంది. ఏడాది నుంచి ఏడాదికి అప్పులు పెరుగుతుండడంతో అందుకు అనుగుణంగా వడ్డీ భారం కూడా పెరగనుంది.

గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రోడక్ట్ (జీఎస్‌డీపీ) రాష్ట్రంలో ఉత్పత్తి చేయబడిన వస్తువులు, సేవల మొత్తాన్ని తెలియచేయనుంది. జీఎస్‌డీపీ ప్రమాణంలో 25శాతం లోగా రాష్ట్ర ప్రభుత్వం అప్పులు చేసేందుకు వెసలుబాటు ఉంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో 23.24శాతంగా పొందిన లక్ష కోట్ల రూపాయలు దాకా అప్పు చేసే అవకాశం ఉంది. ఇలా ఏటా లక్షలకోట్ల అప్పులు చేసుకుంటూ పోతే రాష్ట్రం దివాళా తీయనుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అప్పుల పాలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ప్రతిపక్షనేత ఆర్ అశోక్ మండిపాటు



ప్రతి కన్నడిగుడిపైనా లక్ష రూపాయల అప్పు మోపేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని రాష్ట్ర బీజేపీ ప్రతిపక్షనేత ఆర్ అశోక్ ఆరోపించారు. కర్ణాటకను సంపూర్ణంగా దివాళా తీయించాలని కాంగ్రెస్ ప్రభుత్వం వన్‌లైన్ అజెండగా ఉందని అభిప్రాయపడ్డారు.. ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 6.65 లక్షల కోట్ల రూపాయల అప్పు కానుందని, ఇలా ప్రతి కన్నడిగుడిపైనా లక్ష రూపాయల అప్పు ఉన్నట్టు అని ఇది అత్యంత సిగ్గుపడాల్సిన చర్య అన్నారు. బీజేపీ పాలనలో స్టార్టప్‌లు, పెట్టుబడుల సాధనలో కర్ణాటక నెంబవన్‌గా ఉండేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల్లో నంబర్‌వన్‌గా చేరిందన్నారు.

శునకం.. సురక్షితం..!



- విధానసౌధలో వీధికుక్కలకు ప్రత్యేక షెల్టర్
- స్పీకర్ యూటీ ఖాదర్ నేతృత్వంలో సమావేశం

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విధానసౌధలో వీధికుక్కలసంఖ్య పెరుగుతున్న తరుణంలో నియంత్రణ, వాటి రక్షణ అంశాలపై జరిగిన సమావేశంలో వాటికి ఆశ్రయం కల్పించాలని తీర్మానించారు. స్పీకర్ యూటీ ఖాదర్ నేతృత్వంలో మంగళవారం జరిగిన సమావేశంలో వీధికుక్కల అంశం ప్రస్తావనకు వచ్చింది. కుక్కల వలన ఇబ్బంది కలుగుతోందని వాటిపై దాడి చేయడమో ఇతరత్రా చర్యలు సరికాదని తీర్మానించారు. వాటి రక్షణ కోసం ఒక ప్రత్యేకస్థలంలో ఉంచి పర్యవేక్షించి బాధ్యతను ఓ ఎన్జీఓకు అప్పగించాలని తీర్మానించారు. ప్రాణిదయాసంఘంతోపాటు పలు ఎన్జీఓలు పెంపుడు జంతువుల బాధ్యతలను పర్యవేక్షిస్తారని అటువంటివారికి అప్పగించనున్నారు. విధానసౌధకు వచ్చే ప్రజలకు ఇబ్బంది లేకుండా వ్యవస్థ కల్పించాలని తీర్మానించారు. పరిషత్ సభాపతి బసవరాజహొరట్టి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావుతోపాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

28 నుంచి పుస్తకమేళా

ఈనెల 28నుంచి మార్చి 3వరకు విధానసౌధలో ఆహార, పుస్తమేళాను నిర్వహించదలిచారు. సాహిత్య చర్చలు, ప్రముఖ సాహితీవేత్తలకు సత్కారం చేయదలిచారు. శాసనసభ సచివాలయం ద్వారా పుస్తకమేళా నిర్వహించదలిచినట్టు స్పీకర్ తెలిపారు. ఎమ్మెల్యేలకు పుస్తకాల కొనుగోళ్లకు ఎమ్మెల్యే గ్రాంట్ల ద్వారా రూ.3లక్షలు విడుదల చేసినట్టు తెలిపారు. ప్రతిరోజూ సాయంత్రం జానపదకళలు, సంస్కృతి పరంపర కార్యక్రమాలు ఉంటాయన్నారు. బుక్‌మేళాలో అన్నిరకాల పుస్తకాలు అందుబాటులో ఉంటాయని ప్రత్యేకత ఏపీ ఉండవన్నారు.

13 నుంచి ఏషియన్ శతమాన ఉత్సవ్

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): అలయెన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఈనెల 13నుంచి 15వరకు సాహిత్య, సాంస్కృతిక సంబరాలు ఏషియన్ శతమాన ఉత్సవ్ పేరిట నిర్వహించనున్నారు. నాల్గో విడత జరిగే ఉత్సవ్‌లో ప్రపంచ సంస్కృతి, రాజకీయాలు, ఆర్థికత, కళలు, సాహిత్యం వంటి అంశాలపై కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ప్రముఖ కవి జావేద్ అక్తర్, అయోధ్య బాలరాముడి విగ్రహ శిల్పి యోగిరాజ్ ప్రదర్శనలు, స్టాండప్ కమెడియన్ అయ్యో శారదతోపాటు ప్రముఖ జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్, అంజుబాబి జార్జ్, అనిల్‌కుంబ్లె, అస్కో యుజుకి, యాంద్రి కుర్కోలు భాగస్వామ్యులు కానున్నారు. 120మంది రచయితలు, ప్రదర్శనలు భాగస్వామ్యులు కానున్నారు. హస్తకళల ప్రదర్శన, ఫ్యాషన్‌షో వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జాతీయ అంతర్జాతీయస్థాయి సంస్కృతి, సాహిత్య ప్రదర్శనలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైభవం.. రామభక్తుడి రథోత్సవం

- కోదండరామాంజనేయస్వామి రథోత్సవానికి తరలివచ్చిన భక్తులు
- రథసప్తమి సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చేళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాలూకా కేంద్రమైన చేళూరులో రథసప్తమిని పురస్కరించుకుని కోదండరామాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తిని అలంకరించిన రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవాలకు బాగేపల్లి ఎమ్మెల్యే ఎస్ఎన్ సుబ్బారెడ్డి హాజరయ్యారు. ఆలయ అర్చకబృందం ఆయనకు పూర్ణకుంభస్వాగతం పలికారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలసి రథోత్సవానికి శ్రీకారం చుట్టారు. విజయవాడకు చెందిన బాలకృష్ణ గురూజీ పాల్గొన్నారు. సమీప గ్రామాల ప్రజలు భారీ ఎత్తున రథోత్సవంలో పాల్గొన్నారు.



అలంకరణలో మూలవిరాట్టు



ప్రాకారోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సూర్యప్రభ వాహనంపై శ్రీవారు

చింతామణి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని పురాణ ప్రసిద్ధ ఆలంబగిరిపై కొలువైన కల్కి లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని విశేష సూర్యప్రభా ఉత్సవం మంగళవారం నిర్వహించారు. నూతనంగా నిర్మించిన సూర్యప్రభా ఉత్సవ పీఠాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. సూర్యప్రభ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ వెంకటరమణస్వామిని మంగళవాయిద్యాలతో ఘనంగా ఊరేగించారు. ఉదయం నుంచే స్వామివారికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయాన్ని విశేషంగా ముస్తాబు చేశారు. గర్భగుడిలోని మూలవిరాట్టుకు ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు. స్వామివారికి అష్టావధాన సేవ, మహామంగళారతి ఇచ్చారు. పెద్దసంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ముడా ఇంటి స్థలాల

వివాదం

- దేశాయ్ కమిషన్‌కు గడువు పొడిగింపు



బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార (ముడా)లో వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన దేశాయ్ కమిషన్ గడువు పెంచారు. 2006 నుంచి 2024 జూలై 15 వరకు భూస్వాధీనం, లే అవుట్‌లు, ఇంటి స్థలాల పంపిణీ, పరిహారం వంటి అన్ని అంశాలపైనా సమగ్ర నివేదిక కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైకోర్టు మాజీ న్యాయమూర్తి పీఎస్ దేశాయ్ కమిషన్‌ను మే వరకు గడువు పెంచారు. విచారణ కమిషన్ గడువు పెంచాలని కమిషన్ కార్యదర్శి జనవరి 6న ప్రభుత్వాన్ని కోరారు. అందుకు అనుగుణంగానే మే చివరిదాకా గడువు పెంచారు. గతంలో సీఎంలుగా వ్యవహరించిన కుమారస్వామి, బీఎస్ యడియూరప్ప, సిద్దరామయ్య (రెండు సార్లు సీఎంలు), జగదీశ్‌శెట్టర్, సదానందగౌడ, బసవరాజ్ బొమ్మై ఒక్కోసారి ముఖ్యమంత్రిగా కొనసాగిన కాలంలో ముడా అవినీతిపై విచారణలు జరపాల్సి ఉంది. సీఎం సిద్దరామయ్య భార్య పార్వతికి ముడా నుంచి 14 ఇంటి స్థలాలు కేటాయింపుపై కోర్టులో కేసులు నమోదు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం దేశాయ్ కమిటీని 2024 జూలైలో ఏర్పాటు చేసింది.

క్రాంతివీర బ్రిగేడ్‌కు శ్రీకారం

- మఠాధిపతులకు పాదపూజతో ప్రారంభించిన ఈశ్వరప్ప

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బీజేపీలో రెబెల్‌నేతగా కొనసాగి పార్టీకి దూరమైన మాజీ డీసీఎం ఈశ్వరప్ప మంగళవారం క్రాంతివీరబ్రిగేడ్‌కు శ్రీకారం చుట్టారు. విజయపురలోని బసవనబాగేవాడిలో 1008 మంది మఠాధిపతులు, సాధువులు, సన్యాసులకు పాదపూజ చేయడం ద్వారా బ్రిగేడ్‌ను ప్రారంభించారు. కన్హేరి మఠం అదృశ్యకాడసిద్దేశ్వర స్వామీజీ తొలుత గోపూజ చేశారు. అనంతరం 1008మంది మహిళలు కళశాలు మోసుకుంటూ వచ్చారు. క్రాంతివీర బ్రిగేడ్ లోగోను కనకగురుపీఠం తింథణిశాఖ మఠాధిపతి సిద్దరామానందపురి స్వామీజీ, సోమలింగేశ్వరస్వామీజీ, ఇంగళేశ్వరస్వామీజీ, బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజ్ బాళికాయ్, కార్యాధ్యక్షుడు రాకేశ్ ఈశ్వరప్ప, మహిళా విభాగం అధ్యక్షురాలు శిల్పా కుదరగొండ, రాజేశ్వరితోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరప్ప మాట్లాడుతూ సమాజంలో హిందువులను సమైక్యం చేయాలనేది ఆశయమన్నారు. రాజకీయాల్లో వివిధ హోదాల్లో కొనసాగానని, ఎన్నో దశాబ్దాల అనుభం ఉందని, కానీ ఇటీవలి కాంగ్రెస్ ప్రభుత్వ పరిణామాలు పూర్తిగా సమాజంలో విద్వేషం రగిల్చేలా ఉన్నాయన్నారు. క్రాంతివీర బ్రిగేడ్ ద్వారా రాష్ట్రమంతటా పర్యటించి తాలూకా, జిల్లా కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈశ్వరప్ప కుమారుడు కాంతేశ్ పాల్గొన్నారు.



క్రాంతివీర బ్రిగేడ్ లోగో ఆవిష్కరణలో ఈశ్వరప్ప తదితరులు



బటన్ రోజా ధరలకు రెక్కలు

హోసూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు ప్రాంతంలో బటన్ రోజా ధర మంగళవారం రూ.160 ధర పలకడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హోసూరు పరిసరాల్లోని బాగలూరు, బేరికై, కెలమంగలం, ఉద్దన్నపల్లి, ప్రాంతాల్లో బటన్‌రోజాను రైతులు విరివిగా సాగు చేస్తున్నారు. పెళిళ్ల, రథోత్సవాల సందర్భంగా పూల ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు.

అమ్మకానికి సిద్ధంగా ఉన్న బటన్ రోజాలు

పనులు పూర్తయినా.. ప్రారంభించరా..?

- దుర్గమ్మ గుడి అండర్ పాస్ వద్ద బీజేపీధర్నా

8



వివాదానికి కారణమైన ఫ్లెక్సీ

నాలవారమఠంలో స్వామీజీ బంధువు ఆత్మహత్య



మల్లికార్జున హిరేమఠ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కలబురగి జిల్లా చిత్తాపుర తాలూకా వాడిలోని నాలవార కోరిసిద్దేశ్వర సంస్థానమఠంలో పీఠాధిపతి సిద్దతోటేంద్ర శివాచార్య స్వామీజీ బంధువు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మల్లికార్జున హిరేమఠ (35) శాలువాతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు ఒడిగట్టాడు. మఠంలోని ఓ గదిలో ఒంటరిగా ఉండే అంతను మంగళవారం ఉదయం ఎంతసేపటికీ తలుపులు తీయలేదు. అనుమానం రావడంతో సిబ్బంది కిటికీలో పరిశీలించగా ఉరి వేసుకున్నట్లు గుర్తించారు. కోరిసిద్దేశ్వరసంస్థాన మఠం జాతర సోమవారంతో ముగిసింది. ఆరురోజులపాటు ధార్మిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్న మల్లికార్జున ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. చిత్తాపుర గ్రామీణ పోలీసులు మఠాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



కూడేరు మండలం శివరాంపేట రైతు ఎర్రిస్వామికి నలుగురు కూతుళ్లు. ముగ్గురిని పదో తరగతి వరకూ చదివించి, పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. చిన్న కూతురు ఇందు ఉరవకొండలో డిగ్రీ చదువుతోంది. ఎర్రిస్వామికి రెండు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు గ్రామ సమీపంలో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని, వేరుశనగ సాగు చేశారు. రబీ పంట కావడంతో బోరు నీరే ఆధారం. ఆయనకు కొడుకులు లేరు. ఆ లోటును ఇందు తీరుస్తోంది. ఉదయమే నాన్నతో కలిసి పొలానికి వెళుతుంది. తుంపర సేద్యంలో సాయపడుతుంది. నాన్నతో కలిసి బరువైన పైపులను భుజానికి ఎత్తుకుని.. పొలంలో మారుస్తుంది. ఆ తరువాత ఇంటికి వెళ్లి తయారై.. కాలేజీకి వెళుతుంది. 'నా భార్య కూలి పనులకు వెళుతుంది. సేద్యంలో నా బిడ్డ తోడుగా ఉంటోంది' అని ఎర్రిస్వామి అన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

వైభవంగా రథసప్తమి వేడుకలు

● ఆలయానికి పోటెత్తిన భక్తులు


ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అష్టోత్తర శతక్షీరాభిషేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఛాయా ఉష సమేత సూర్యనారాయణస్వామిని పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి అర్చకులు కల్యాణా న్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, మహాసౌరపూర్వక అరుణహోమాన్ని చేపట్టారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు మహేంద్రగౌడ్, సుధాకర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ఎన్నేళ్లు ఇలా..?

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అన్నదాతల నిరీక్షణ

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 50వేలకుపైగా దరఖాస్తులు

డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్న 11 వేల మంది

వేధిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత

అనంతపురం రూరల్/కూడేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బోరు బావుల్లో సమృద్ధిగా నీరున్నా, విద్యుత్ సౌకర్యం లేక రైతులు పంటలు సాగు చేయలేని స్థితిని ఎదుర్కొంటు న్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం వేల దరఖాస్తులు విద్యుత్ శాఖలో మూలుగుతున్నాయి. జిల్లా విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య 11వేలకు పైగానే ఉంది. ఈమేరకు రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కళ్యాణదుర్గం డివిజన్‌లో అధికంగా పెండింగ్

జిల్లాలోని అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఇప్పటికే 2.02లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్ల పరిధిలో కొత్తగా మరో 50వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి తోడు 11,111 మంది రైతులు కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించి ఎదురు చూస్తున్నారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 6003, అనంతపురం డివిజన్ పరిధిలో 2847, గుత్తి డివిజన్ పరిధిలో 2261 మంది రైతులు డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లా విద్యుత్ శాఖలో పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు వ్యవసాయ కనెక్షన్ల కోసం చెల్లించిన వారికే 2,950 ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాల్సి ఉంది. ఇదే క్రమంలో కండక్టర్(వైరు) 2034కిలో మీటర్ల మేర అవసరం ఉంది.

ప్రజా ప్రతినిధులు చొరవ చూపితేనే...

ఏపార్టీ అధికారంలో ఉన్నా మాది రైతు ప్రభుత్వం. రైతుల సంక్షేమమే మాధ్యేయం అని నాయకులు, ప్రజాప్రతినిధులు ఊదరగొడుతుంటారు. కానీ వారి మాటలు, హామీలు అన్నీ నీటిమీద బుడగలే. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలే ఇందుకు నిదర్శనం. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో మంజూరుకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంటకు నీరందించేందుకు కరెంటు కనెక్షన్ లేకపోవడంతో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఇదే దౌర్భాగ్య పరిస్థితి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఇవి తెలియనివీ కావు. అయినా అలా వింటూ.. చూస్తూ.. ఉండిపోవడం వారికి పరిపాటైపోయింది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే జిల్లా రైతాంగానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది.

● **ఏడాదిగా ఎదురుచూస్తున్నా**



వ్యవసాయ కనెక్షన్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా. ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చారు. కండక్టర్ ఇంత వరకు ఇవ్వలేదు. నాలుగు ఎల్‌టి స్తంభాలకు వైరు, మూడు స్తంభాలకు సర్వీసు వైరు ఇవ్వాల్సి ఉంది. ఇంత వరకు ఇవ్వలేదు.

- రమేష్, కొర్రకోడు, కూడేరు మండలం

● **ఆరేడేళ్లుగా ఎదురుచూపులే**



టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది. ఆ తరువాత ఇతర సామగ్రి ఏది ఇవ్వలేదు. ఇప్పటికి దాదాపు ఆరేడేళ్లు అవుతోంది. వైరు ఇవ్వలేదు. ఇతర సామగ్రి ఇవ్వలేదు. విసుగెత్తి అడగటమే మానేశా. పక్క రైతును అడిగి ఒకే దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకుని వినియోగించుకుంటున్నా.

- వెంకటేష్, రైతు కొర్రకోడు, కూడేరు మండలం

● **వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చాం**



జనవరి నెలలో రైతులకు వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాం. ఇంకా అవసరం ఉన్నాయి. ఆ మేరకు సంస్థ ఉన్నతాధికారులకు నివేదించాం. కండక్టర్ కొరత ఉంది. రెండువేల మీటర్ల కండక్టర్ కావాలి. ఈ నెలలో కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు సీనియార్టీ మేరకు అందిస్తాం.

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

ప్రణాళికతో పదింతల ఫలితం

సాధన చేస్తే మంచి మార్కులు

పది విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితానికి తొలి సోపానం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంవత్సరమంతా కష్టపడి చదివిన శ్రమ వృథాకాకుండా ఉండాలంటే రాబోయే కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులు టైం టేబుల్ రూపొందించుకొని చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని చెబుతున్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయుల సూచనలు ఇలా ఉన్నాయి.

● **సులభంగా తెలుగులో మార్కులు**

- విశ్వేశ్వరరావు, తెలుగు పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



తెలుగులో మంచి మార్కులు సాధించుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. చక్కటి రాత, అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జాగ్రత్తపడాలి. అవగాహన, ప్రతిస్పందనకు 32 మార్కులు, వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు ఉంటాయి. పద్యపాఠ్యంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి రెండు మార్కులు. రెండో ప్రశ్న పరిచిత గద్యభాగం, మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి ఉంటాయి. నాలుగు వాక్యాలిచ్చి ఏ కాండమునకు చెందినదో రాయాలి. నాల్గో ప్రశ్నగా పత్రికా ప్రకటన, లేఖ, అపరిచిత గద్యంలో ఏదో ఒక అంశం ఇచ్చి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వాటిని చదివి ఒక వాక్యంలో సమాధానం రాస్తే నాలుగు ప్రశ్నలకు ఎనిమిది మార్కులు వస్తాయి. వ్యక్తీకరణ, సృజనాత్మకత భాగంలో 5,6,7 ప్రశ్నలన్నీ రాయాలి. కవి పరిచయం, పద్య పాఠ్యాంశాలు చదవాలి. 6,7 ప్రశ్నలకు పరిచయం, కథనం, వ్యాసం, నాటకం, నేపథ్యం ఉంటాయి. 8,9,10 వ్యాసరూప ప్రశ్నలు ఉంటాయి. 11 నుంచి 19 వరకూ రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఇందులో.. శబ్ద, అర్థాలంకారాలు, చందస్సు, జాతీయాలు, సంధులు, సమాసాలు ఉంటాయి. వీటిపై నిరంతరం సాధన అవసరం.

● **హిందీ కష్టమేమీ కాదు**

- ఇందిర, హిందీ పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



హిందీ అంటే కష్టం అనే భయాన్ని వదిలేయాలి. హిందీలో పద్యాలు, వ్యాకరణం, సాహిత్యం నేర్చుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సాఖీ పాఠం నుంచి మొదటి నాలుగు ప్రశ్నలు, దోహే పాఠం నుంచి ఏదో ఒక ప్రశ్న ఉంటుంది. ఉపవాచకంలో మొదటి, రెండు పాఠ్యాంశాల నుంచి రెండు ప్రశ్నలు ఇస్తారు. పద్యాలు, కవులు, పాఠాలు, రచయితల గురించి తండ్రి, పుస్తక విక్రేతకు లేఖ రాయడం నేర్చుకోవాలి. ఎస్‌సీఈఆర్‌టీ ప్రణాళికను అనుసరిస్తే 90 శాతం పైగా మార్కులు సాధించవచ్చు.

● **ఆంగ్లంపై ఆందోళన వద్దు**

- ఎల్‌వీ రమణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



ఆంగ్లం అంటే అందరూ ఆందోళన పడుతుంటారు. అర్థం చేసుకుంటూ చదివితే చాలా సులభం. ఆంగ్ల పరీక్ష పేపర్ మూడు భాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఏలో రీడింగ్ కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఆరు మార్కులకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. 1 నుంచి 15, 16, 17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్-బిలో ఒకాబులరీ, గ్రామర్ 40 మార్కులకు ఉంటుంది. మొత్తం పాఠ్యంశాలు బాగా చదివితే 18 నుంచి 34 ప్రశ్న వరకూ సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్-సిలో 30 మార్కుల్లో 35 వ ప్రశ్న డైరీ రైటింగ్, 36వ ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరాగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటివ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలపై సాధన చేయాలి.

● **మ్యాప్‌లపై దృష్టి సారించాలి**

- మాధవీలత, సాంఘిక శాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లు గీయడం, ప్రాంతాలు గుర్తించడంపై దృష్టి సారించాలి. పరీక్షల్లో 33 ప్రశ్నలు, 4 సెక్షన్లు ఉంటాయి. జాగ్రఫీ, చరిత్ర, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం ప్రశ్నలకు 23 చొప్పున మార్కులు, మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు ఉంటాయి. 4,8 ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు విధిగా సైడ్ హెడ్డింగులు పెట్టాలి. పాయింట్ల రూపంలో జవాబులు రాస్తూ ప్రధాన విషయానికి అండర్‌లైన్ చేయాలి. అక్షరాలు గుండ్రంగా రాస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు.

● **చిత్రాలపై సాధన చేయాలి**



భౌతిక శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. 17 ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒకమార్కు ప్రశ్నలు 8 ఉంటాయి. రెండు మార్కుల ప్రశ్నలు మూడు, నాలుగు మార్కుల ప్రశ్నలు మూడు ఉంటాయి. (వీటికి చాయిస్ ఉండదు) 12వ ప్రశ్నకు డయాగ్రామ్‌కు చాయిస్ ఉంటుంది. 8 మార్కుల ప్రశ్నకు అంతర్గత చాయిస్ ఉంటుంది. ఆమ్లాలు, క్షారాల యందు చాయిస్‌తో కలిపి 9 మార్కులు ఉంటాయి. కాంతి పరావర్తనము, వక్రీభవనములో చాయిస్‌తో కలిపి 9 మార్కులకు ఉంటుంది. విద్యుత్, మానవుని కన్ను అందమైన ప్రపంచము యూనిట్‌లో 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. రసాయన చర్యలు, సమీకరణాలు, కర్బన సమ్మేళనాలలో 8 మార్కులకు చాయిస్ ఉంటాయి. విద్యుదయస్కాంత యూనిట్, లోహాలు, అలోహాల నందు 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. కర్బన సమ్మేళనం యూనిట్‌లో 10 మార్కులు సాధించవచ్చు.

- ఇర్షాద్‌వలి, ఫిజిక్స్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● **గణితంలో వంద మార్కులు సాధ్యమే**



ఇతర సబ్జెక్టులతో పోలిస్తే గణితంలో వందకు వంద మార్కులు సాధించవచ్చు. గణితంలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. త్రికోణమితిలో ప్రతి లెక్కనూ బొమ్మలతో వివరిస్తే మంచి మార్కులు వస్తాయి. ప్రతి లెక్కకూ సూత్రాలను అన్వయించాలి. త్రిభుజాలు, రేఖా సమీకరణాలు, ఉపరితల వైశాల్యం తదితర పాఠాల నుంచి 1,2 మార్కులు ఎక్కువగా వస్తాయి. బహుపదుల నుంచి నాలుగు మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. గ్రాఫ్ ఆధారిత లెక్కలు, సాంఖ్యక శాస్త్రం, రేఖా గణితం, వాస్తవ సంఖ్యలపై పట్టు సాధించాలి. ముఖ్యమైన సూత్రాలను గుర్తు పెట్టుకోవాలి. (హెచ్.సి.బి), గ.సా.భ.(ఎల్.సి.బి), కసాగు అంక గణితం, సగటు, మధ్యగణితం, బాహులకం వంటి లెక్కలపై దృష్టి పెట్టాలి. కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- డి.భాస్కర్‌రెడ్డి, గణితం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● **బ్లూప్రింట్ ఆధారంగా చదవాలి**



జీవశాస్త్రంలో 50 మార్కులకు 17 ప్రశ్నలు ఉంటాయి. బ్లూప్రింట్ ఆధారంగా జీవక్రియలు అనువంశికత, ప్రత్యుత్పత్తిపై విద్యార్థులు దృష్టిసారించి చదివితే అధిక మార్కులు సాధించవచ్చు. చిత్రాలు, భాగాలు గుర్తించడం వంటి ఆధారంగా ప్రశ్నలు ఉం టాయి. ప్రయోగాలు చేసే విధానం భే దాలపై సాధన చేయా లి. వీటిని అనుసరిస్తే విద్యార్థులు జీవశాస్త్రంలో అనుకున్న మార్కులను సాధించగలుగుతారు.

- వెంకటశివారెడ్డి, జీవశాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

వాటర్‌షెడ్ పనుల్లో గోల్‌మాల్

గత ప్రభుత్వంలో రూ.5 కోట్ల దుర్వినియోగం

వైసీపీ కార్యాలయంలో వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు

నాయకులు, అధికారుల జేబుల్లోకి నిధులు

తాజాగా వెలుగులోకి వస్తున్న అప్పటి అక్రమాలు

అక్రమార్కులకు క్లీన్‌చిట్ ఇస్తున్న వైనం

డ్వామా విజిలెన్స్‌లో మాయాజాలం


పనిచేసిన ఏడాదిలోపే చిన్నపాటి వర్షానికే కొట్టుకు పోయిన గొల్ల వాటర్‌షెడ్ పరిధిలోని రాతితో నిర్మించిన ఫారంపాండ్

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, నాయకులు కుమ్మకై ప్రజాసొమ్మును మెక్కేశారు. గత ఐదేళ్లలో వాటర్‌షెడ్ నిధులను సుమారు రూ.5కోట్ల మేర బొక్కేశారు. వాటర్‌షెడ్ పనులన్నీ అప్పటి వైసీపీ నేతల కనుసన్నల్లో సాగాయి. పార్టీ కార్యాలయాల్లోనే వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం ఇందుకు నిదర్శనం. వీటిపై నిఘా పెట్టాల్సిన నిఘా అధికారులే వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వాటర్‌షెడ్ ద్వారా రూ.5కోట్ల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు సామాజిక తనిఖీలో తేటతెల్లమైంది. ఈ సొమ్మును రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యం చేస్తోంది. ఆ విభాగంలో కీలకంగా ఉన్న ఇద్దరు అధికారులతో పాటు పలువురు ఉద్యోగులు, వాటర్‌షెడ్ విభాగం అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటర్‌షెడ్ పనులన్నీ ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరిగాయి. పంచాయతీ పరిధిలోని సర్పంచ్, గ్రామ పెద్దలు, వాటర్‌షెడ్ అధికారుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి పనులకు ఆమోదం పొందాలి. ఇందుకు భిన్నంగా వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధుల ఇళ్లలోనూ, వైసీపీ కార్యాలయాల్లోనూ నిర్వహించారు. పనులు చేయకపోయినా బిల్లులు చేసుకుని నిధులు స్వాహా చేశారు.

రూ.5 కోట్లు హాంఫట్

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్ షెడ్ పథకం కింద రూ.6.5 కోట్ల వరకు నిధులు పక్కదారిపట్టాయి. ఇప్పటి వరకు రూ.1.5 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన సొమ్మును రికవరీ చేయడంలో నిఘా విభాగం అధికారులు విఫలమవుతున్నారని తెలుస్తోంది. ఇందులో వాటర్‌షెడ్ పీఓ, ఏపీఓ, టీఓ, సీఓలకు సంబంధించిన క్రిమినల్ కేసులు నమోదు కాగా.. రూ.1.93 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఏపీఎం నుంచి ఒక కేసుకు సంబంధించి రూ.1.08 కోట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ నుంచి మూడు కేసులకు రూ.1.03 కోట్లు, గ్రామైక్య సంఘం సహాయకుల నుంచి మూడు కేసులకు గాను రూ.97.64 లక్షలు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది.


బూదగవి వద్ద ఉపాధి నిధులతో తవ్విన ఈ ఫారంపాండ్లకు.. వాటర్‌షెడ్ కింద బిల్లులు చేసుకున్నారు

బూదగవి, గొల్ల వాటర్‌షెడ్లలో ఇష్టానుసారం బిల్లులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బూదగవిలో సుమారు రూ.90 లక్షల బిల్లులు చేయగా ఇందులో సగం కూడా పనులు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పథకం కింద చేసిన ఫారంపాండ్లను నల్లరేగడి నేలల్లో వాటర్‌షెడ్ కింద కూడా బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. కళ్యాణదుర్గం మండలం గొల్ల పంచాయతీ వాటర్‌షెడ్‌లోనూ ఇదే పరిస్థితి. రాప్తాడు మండలం హంపాపురంలో ఒక్కో పనికి రెండు సార్లు బిల్లులు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. శింగనమల మండలం వెస్ట్‌నరసాపురం, తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామ వాటర్‌షెడ్లలోనూ చేయని పనులకు, ఉపాధి పథకం కింద చేసిన పనులకు బిల్లులు చేశారని సమాచారం.

ప్రతి పైసా లెక్కిస్తాం

వాటర్‌షెడ్ ప్రాజెక్టుల్లో చేపట్టిన ప్రతి పనికి వెచ్చించిన ప్రతి పైసా లెక్కిస్తాం. ఎక్కడైనా సరే లెక్క తప్పితే కచ్చితంగా సంబంధిత సిబ్బంది లేదా పనిచేసిన వారి నుంచి రికవరీ చేస్తాం. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌లో మొత్తం పనిలో 10 శాతం నిధులు హోల్డ్‌లో ఉంటాయి. పూర్తి పనికి సంబంధించిన వివరాలు, రికార్డులు అందజేసినప్పుడే ఆ నిధులు చెల్లిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ప్రభుత్వ సొమ్ముకు జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. గతంలో చేసిన పనులపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం.

-సలీం బాషా, పీడీ, డ్వామా


గరుడ వాహనంపై స్వామి వారు

వైభవంగా నారసింహుడి కల్యాణం

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ, గరుడ, గో వాహనోత్సవం, హనుమద్వాహన సేవలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను వాహనాలపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి, అర్చకులు ద్వారకనాథాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని చేపట్టారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

షేక్ నాజర్ (జయంతి)



బుర్రకథా పితామహుడిగా పేరొందిన 'పద్మశ్రీ' గ్రహీత షేక్ నాజర్ వలి 1920 ఫిబ్రవరి 5న గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో జన్మించారు. ప్రాచీన జానపద కళారూపమైన బుర్ర కథకు జీవం పోసి మెరుగులు దిద్ది, ప్రత్యేక ఆహార్యంతో తగిన హావభావాలతో ప్రదర్శనలిచ్చి విస్తృత ప్రచారం చేశారు. నటుడు, ప్రజా రచయిత, గాయకుడు కూడా. కృష్ణలీలలో దేవకి, శ్రీకృష్ణ తులాభారంలో రుక్మిణి, భక్త రామదాసులో ఛాందిని వంటి స్త్రీ పాత్రలతో ప్రేక్షకులను మెప్పించారు. కమ్యూనిస్టు పార్టీలో చేరి ప్రజా నాట్య మండలి ద్వారా పార్టీ సిద్ధాంతాలు, కార్యక్రమాలను బుర్రకథల ద్వారా చేరువ చేశారు. 'విరసం' సభ్యుడిగా కూడా కొనసాగారు. ఆంధ్ర నాటక అకాడమీచే 1981లో ఉత్తమ కళాకారుడిగా సత్కారం, ఇతర గౌరవాలు అందుకున్నారు. 1997 ఫిబ్రవరి 22న కన్నుమూశారు.

వట్టికోట ఆళ్వారుస్వామి (వర్ధంతి)



వట్టికోట ఆళ్వారుస్వామి 1915 నవంబరు 1న నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారంలో జన్మించారు. తెలంగాణ ప్రజాసాహిత్యానికి పాదులు వేసి ప్రాణం పోశారు. రచయిత, సేవాశీలి, ఉద్యమకర్త, కమ్యూనిస్టు నేత, ప్రచురణకర్త, పాత్రికేయుడు, ప్రచారకుడు, భాషా సాహిత్యాల దగ్గర్నుంచి పౌర హక్కులదాకా వట్టికోట అన్ని ఉద్యమాల్లో పాలుపంచుకున్నారు. తెలుగులో రాజకీయ నవలలకు ఆద్యుడు. నిజాంను గడగడలాడించిన ఆంధ్రమహాసభ నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. హోటల్ కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి సొంతంగా చదువుకుని రచయిత, ప్రచురణకర్తగా ఎదిగారు. 1961 ఫిబ్రవరి 5న కన్నుమూశారు.

డాక్టర్ ప్రతాపచంద్ర రెడ్డి (పుట్టినరోజు)




దేశంలోని తొలి కార్పొరేట్ చైన్ ఆసుపత్రిగా ఉన్న అపోలో ఆసుపత్రి సంస్థాపకుడు డాక్టర్ ప్రతాపచంద్రరెడ్డి 1933 ఫిబ్రవరి 5న చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలం అరగొండలో జన్మించారు. అపోలో ఆసుపత్రిని స్థాపించిన తర్వాత అపోలో ఫార్మసీ సంస్థను కూడా స్థాపించారు. వైద్యరంగానికి ఆయన అందిస్తున్న సేవలకు పద్మభూషణ్, పద్మ విభూషణ్ పురస్కారాలు పొందారు. లయన్స్‌క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నుంచి మానవతా పురస్కారం పొందారు. 2022లో జీవితసాఫల్య పురస్కారం అందుకున్నారు. కాగా ఆయన నలుగురు కుమార్తెలు కూడా అపోలో హాస్పిటల్స్‌లో డైరెక్టర్లుగా కొనసాగుతున్నారు.

అభిషేక్ బచ్చన్ (పుట్టినరోజు)



ప్రముఖ బాలీవుడ్ నటుడు అభిషేక్ బచ్చన్ 1976 ఫిబ్రవరి 5న ముంబైలో జన్మించారు. తల్లి దండ్రులైన అమితాబ్ బచ్చన్, జయ బచ్చన్‌ల నుండి నటన వారసత్వంగా పుణికి పుచ్చుకున్నారు. నటుడిగా, నిర్మాతగా సత్తా చాటుకున్నారు. యువ, సర్కార్, కభీ అల్విదా నా కెహనా చిత్రాలు ఉత్తమ సహాయ నటుడి కేటగిరీలో ఫిలింఫేర్ పురస్కారాన్ని అందించాయి. 2009లో హిందీలో నటించిన 'పా' చిత్రానికి నేషనల్ ఫిలింఫేర్ పురస్కారం లభించింది. ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్‌ను అభిషేక్ వివాహమాడారు.

క్రిస్టియానో రోనాల్డో (పుట్టినరోజు)



ప్రముఖ ఫుట్‌బాల్ క్రీడాకారుడు క్రిస్టియానో రోనాల్డో 1985 ఫిబ్రవరి 5న జన్మించారు. పోర్చుగల్ దేశ ఫుట్‌బాల్ నేషనల్ టీమ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. తన కెరీర్‌లో యూరోపియన్ గోల్డెన్ షూస్, యూఈఎఫ్‌ఏ నేషనల్ లీగ్ టైటిల్ సహా 31 ప్రముఖ ట్రోఫీలను గెలుపొందాడు. ప్రపంచపు అత్యుత్తమ ఫుట్‌బాల్ క్రీడాకారుల్లో ఒకడిగా గుర్తింపు పొందారు. 100 ఇంటర్నేషనల్ గోల్స్, 770 సీనియర్ కెరీర్ గోల్స్‌తో తనదైన రికార్డు సాధించారు.

నేడు తుది విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు బుధవారం తుది విడత ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 121 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల నూతన పాలక వర్గం ఎన్నికలకు పశుసవర్ధక శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా స్థానిక వెటర్నరీ డాక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి దాకా మూడు విడతల్లో 107 సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా.. తగిన రికార్డులు లేకపోవడంతో 20 సంఘాల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, ఎన్నికలు నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

అనధికార రథం షెడ్ తొలగింపు

▸ రూ.1.61 కోట్లతో అజాద్‌చౌక్ అభివృద్ధి



రథం షెడ్ తొలగింపు కార్యాచరణలో పోలీసులు, అధికారులు

చింతామణి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నగరసభ పరిధిలోని అజాద్ చౌక్‌లో డల్ఫ్ పథకం కింద రూ.1.61కోట్లతో అభివృద్ధి చేపట్టారు. నిర్మాణాలకు అనధికారి రథం షెడ్ ఆటంకంగా మారింది. దీంతో తాలూకా యంత్రాంగం మంగళవారం ఉదయం ప్రత్యేక కార్యాచరణ చేపట్టి రథం అసలు ప్రదేశానికి చేర్పించింది. పట్టణంలోని అజాద్‌చౌక్‌లో హరిహరేశరస్వామి ఆలయ ట్రస్టు దేవాలయానికి చెందిన పాత రథం దుస్థితికి రావడంతో నూతన రథం నిర్మాణానికి ట్రస్టు సిద్ధమైంది. రథం నిర్మాణ పనులు ముగిశాక జోడింపు ప్రక్రియ కోసం రద్దీప్రదేశమైన అజాద్‌చౌక్‌లో తాత్కాలిక షెడ్ ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు నగరసభ నుంచి ఎటువంటి ముందస్తు అనుమతి పొందలేదు. నూతనరథం జోడింపు ప్రక్రియ ముగిశాక రథం అసలు ప్రదేశమైన డైమండ్ టాకీస్ స్థలానికి మార్పు చేయకుండా కొంతకాలంగా అక్కడే కొనసాగిస్తున్నారు. ఇది ట్రాఫిక్ సంచారానికి ఇబ్బందిగా మారింది. సమస్యను నియోజకవర్గ ఎమ్మెల్యే, ఉన్నతవిద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన స్పందించారు. పట్టణంలోని అజాద్‌చౌక్‌ను మాదిరిగా తీర్చిదిద్దాలని ఇప్పటికే నిర్ణయించి ఉండడంతో డల్ఫ్ పథకం కింద రూ.1.61 కోట్లు మంజూరయ్యాయి. టెండరు ప్రక్రియ ముగిసి పనులు చేపట్టేందుకు అనుమతి లభించింది. ఈ నేపథ్యంలో రథం తాత్కాలిక షెడ్‌ను తెల్లవారుజామున తాలూకా యంత్రాంగం, నగరసభ అధికారులు పోలీసుబందోబస్తు మధ్య డైమండ్ టాకీస్‌రోడ్డు ప్రదేశానికి తరలించారు. పట్టణంలోని అజాద్ చౌక్‌లో దశాబ్దాలుగా ప్రముఖ కూడలిగా పేరొందింది. మహారాజుల కాలం నాటి ఒక స్తంభం ఉంది. స్తంభానికి విద్యుత్‌దీపాలు అలంకరించేవారు. ఎటువంటి కార్యక్రమమైన ఈ కూడలిని ప్రత్యేకంగా తీర్చిదిద్దేవారు. ఇలా ఈ కూడలిని మరింత అభివృద్ధి చేసేందుకు మంత్రి చొరవ చూపారు. కార్యాచరణలో చిక్కబళ్ళాపుర జిల్లా ఉపవిభాగాధికారి ఆర్ అశ్విన్, తహసీల్దారు సుదర్శన్ యాదవ్, నగరసభ కమిషనర్ జీఎన్ చలపతి, డీఎస్పీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



షెడ్ తొలగించాక అజాద్‌చౌక్

తిరుమలకు 15 టన్నుల కూరగాయలు



టీటీడీ లారీతో కూరగాయల మండీ యజమానులు

ముళబాగిలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏటా విశేష ధార్మిక కార్యక్రమాల సందర్భంలో తాలూకా నుంచి టమోటా, కూరగాయలను ఎన్ వడ్డహళ్ళి మార్కెట్‌లోని మండియజమానులు, రైతులు ఇస్తున్నారని రోటరీ అధ్యక్షుడు, మండి యజమాని నగవార సత్యణ్ణ తెలిపారు. తాలూకాలోని ఎన్ వడ్డహళ్ళిలోని చిన్నమార్కెట్‌లో రథసప్తమి నేపథ్యంలో బ్రహ్మోరథోత్సవం, అన్న సంతర్పణకు తమవంతుగా 15టన్నుల వివిరకాల కూరగాయల లారీకి సోమవారం పచ్చజెండా చూపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15ఏళ్లుగా క్రమం తప్పకుండా ఏటా శ్రీవారి ఉత్సవాలకు కూరగాయలు పంపుతున్నట్టు తెలిపారు. అంతేకాకుండా వడ్డహళ్ళి మార్కెట్ నుంచి ధర్మస్థళ, కుక్కె, ఆదిచుంచనగిరిమఠం, కాణిపాకం ఆలయాలలో అన్నసంతర్పణకు టమోట, ఇతర కూరగాయలను ఇస్తున్నట్టు తెలిపారు. ఏదైనా ధార్మిసంస్థ డిమాండ్ చేస్తే అందుకు అనుగుణంగా ఉచితంగా ఇవ్వగలమన్నారు. ఈ సందర్భంగా టీటీడీకి చెందిన రవీంద్రరెడ్డి, కూరగాయల మండి యజమానుల సంఘం అధ్యక్షుడు టి వెంకటరవణప్ప, కార్యదర్శి కేఎస్ ప్రభాకర్, కోశాధికారి ఎస్ఎల్‌వి శ్రీనివాస్, సభ్యులు పీటీఆర్ రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): సహజ సిద్ధమైన యోగా ప్రాధాన్యతను ప్రజలకు తెలియచేసేలా లైఫ్ ఎటర్నల్ ట్రస్టు ఆధ్వర్యంలో హెచ్ ఎస్ఆర్ లే అవుట్‌లోని సమర్థనం ఆర్ట్‌సెంటర్ ఆడిటోరియంలో మంగళవారం 'ఆత్మానుభూతి' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. లైఫ్ ఎటర్నల్ ట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ మాతాజి నిర్మలాదేవి 1970లో విశిష్టధ్యాన ప్రక్రియకు శ్రీకారం చుట్టారన్నారు. వ్యక్తిలోని కుండలిని శక్తిని ప్రేరేపించేందుకు సహజయోగా దోహద పడుతుందన్నారు. దైవత్వం గురించి స్వయం సాక్షాత్కారం సాధ్యమన్నారు. శారీరక, మానసిక భావన లకు మించి దైవజ్ఞానంపై అవగాహన కలుగు తుందన్నారు. 160కుపైగా దేశాలలో సహజ యోగాను పాటిస్తున్నారన్నారు. సమర్థనం ట్రస్టు సేవలను ప్రస్తావించారు. కార్యక్రమంలో ఎన్ఐ ఎఫ్‌టి డైరెక్టర్ డాక్టర్ యతీంద్ర లక్ష్మణ్, ఇండి యన్ క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ అధ్య క్షుడు, వరల్డ్ బ్లైండ్ క్రికెట్ లిమిటెడ్ రిటైర్డు అధ్యక్షుడు డాక్టర్ మహంతేశ్, రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి దిలీప్‌కుమార్‌దాస్ తదితరులు పాల్గొన్నారు. ప్రసిద్ధ గాయకుడు కుమారన్ అయ్యర్, టీమ్ సునద, నృత్య క్రీడాకారుడు ప్రీతి సందూర్, మనోరంజన కార్యక్రమాలు అలరించాయి.



ఆత్మానుభూతి కార్యక్రమంలో డాక్టర్ మనోజ్‌కుమార్, మహంతేశ్ తదితరులు

మధ్యతరగతి వర్గాలకు అనుకూల బడ్జెట్



చర్చాగోష్ఠిలో పాల్గొన్న వివిధ రంగాల ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మధ్య తరగతి వర్గాలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్ ఉందని చాంబర్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ కామర్స్ (బీసీఐసీ) మాజీ అధ్యక్షుడు, డెలాయిట్ టచ్ టుమాసో భాగస్వామి కేఆర్ శేఖర్ అభిప్రాయపడ్డారు. కేంద్ర బడ్జెట్ పెట్టుబడుల ద్వారా ఉత్పత్తి రంగంవైపు దృష్టి సారించినట్టుగా ఉందన్నారు. పన్నుల లాభాలు, వ్యక్తుల చేతికి ప్రత్యేకించి మధ్యతరగతి వర్గాలకు అనుకూలం చేసేలా ఉందన్నారు. కేంద్రబడ్జెట్‌పై బీసీఐసీ ప్రత్యేకమైన చర్చాగోష్ఠి జరిపింది. పోస్టల్‌శాఖను గ్రామీణ ఆర్థికతకు బలోపేతం చేయదలిచిందన్నారు. గ్రామాలలో పోస్టాఫీసులసంఖ్య పెంచడం ద్వారా డిపాజిట్‌లు తదితర సౌలభ్యాలకు అనుకూలం కానుందన్నారు. ఓల్వో గ్రూప్ ఇండియా చైర్మన్ ఎండీ కమల్‌బాలి మాట్లాడుతూ బడ్జెట్ ద్వారా దేశంలో మార్పులను ఆకాంక్షించారని తలసరి ఆదాయం పెంచేందుకు కేంద్రం ప్రయత్నించిందన్నారు. వ్యవసాయం, స్టార్టప్‌లు, చిన్నతరహా పరిశ్రమలకు అనుకూలం చేసేలా నిర్ణయాలు తీసుకుందన్నారు. గడిచిన రెండున్నర దశాబ్దాలుగా 13-17శాతంతోనే జీడీపీ ఉందన్నారు. ప్రభుత్వం ఏ చేయాలో దిశానిర్దేశం చేసిందని సవాళ్లను పరిశ్రమలు పరిష్కరించాల్సి ఉందన్నారు. జాతీయ ఉత్పాదనా మిషన్‌ను ప్రగతివైపు తీసుకురావాలనే ఆలోచన శుభ పరిణామమన్నారు. 3వన్4 కేపిటల్ ఫైనాన్షియల్ అధికారి సిద్దార్థపైతోపాటు మణిపాల్ ఆసుపత్రుల అధికారి సమీర్ అగర్వాల్, బీసీఐసీ వైస్‌ప్రెసిడెంట్ కే రవి, డైరెక్ట్ ట్యాక్సెస్ చైర్మన్ సుధీర్‌కుమార్ ధరవేశ్వర్, ట్యాక్సెస్ ఎక్స్‌పర్ట్ కమిటీకి చెందిన శ్రీరామ్‌రంగనాథన్ తమ అభిప్రాయాలు తెలిపారు.

రాఘవేంద్ర మఠంలో విశేష పూజలు

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జయనగర్ ఐదో బ్లాక్‌లోని నంజనగూడు రాఘవేంద్రస్వామి మఠంలో మాఘమాసం శుక్లపక్ష షష్టిను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మఠాధిపతి సుబుధేంద్రతీర్థ స్వామిజీ ఆదేశాలకు మఠం మేనేజర్ ఆర్‌కే వాదీంద్రాచార్య నేతృత్వంలో సుబ్రమణ్య ఆరాధన, బ్రాహ్మణ వటువులకు ఆరాధన మహోత్సవాన్ని ఆచార్య నిర్వహించారు. నందకిశోర్ ఆచార్య, ఆచార్య నాగరాజు హావేరి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తబృందం

నిందితుడిపై కాల్పులు

దొమ్మసంద్ర, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని సర్జాపుర హోబళి దొమ్మసంద్ర గ్రామం సంత మైదానంలో జనవరి 28న బహిరంగ ప్రదేశంలో దారుణంగా మాజీ రౌడీషీటర్ వెంకటేశ్ (వెంకి)ని దారుణంగా హత మార్చిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడిగా భావిస్తున్న శ్రీనివాస్ అలియాస్ గుబ్బచ్చి సీనా గురించిన ఖచ్చితమైన సమాచారం మేరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలో మంగళవారం కార్యాచరణ నిర్వహించారు. అతడిని అదుపులోకి తీసుకునే ప్రయత్నంలో కానిస్టేబుల్ ఇర్ఫాన్ చేతిని చాకుతో శ్రీనివాస్ గాయపరిచాడు. ఈ సందర్భంగా లొంగిపోవాలని పలుమార్లు హెచ్చరించినా ప్రయోజనం లేకపోవడంతో శ్రీనివాస్ కాలిపై ఫైరింగ్ చేశారు. గాయపడిన అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలాన్ని బెంగళూరు రూరల్ ఎస్పీ సీకే బాబా, ఆనేకల్ డీఎస్పీ మోహన్‌కుమార్ సర్జాపుర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌కుమార్ తదితరులు పరిశీలించారు.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్పీ సీకే బాబా

50 స్టార్టప్‌లకు హెచ్‌డీఎఫ్‌సీ ప్రోత్సాహం

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఆర్థికసంవత్సరంలో 50కుపైగా పరివర్తన్ స్టార్టప్‌లకు ఫండింగ్ ద్వారా ప్రోత్సహించదలిచినట్టు ప్రకటించారు. దేశవ్యాప్తంగా 15ఇంకుబేటర్‌లు, యాక్సిలేటర్‌లను ఎంపిక చేసి సామాజిక మార్పులు తీసుకొచ్చేరంగంలో పనిచేస్తున్న 50-60 స్టార్టప్‌లను ప్రోత్సహించదలిచినట్టు ప్రకటించారు. సుస్థిర అభివృద్ధితోపాటు సామాజిక మార్పుకు ఏఐ, పర్యావరణ ఆవిష్కరణలు, వ్యవసాయ, సుస్థిర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, విద్య, జీవనోపాధి పెంపు, లింగ వైవిధ్యత వంటి పనిచేసేవాటిని ప్రోత్సహించనున్నట్టు బ్యాంకు డీఎండీ ఖైజూద్‌బరూచా ప్రకటించారు. ఈమేరకు మంగళవారం నగరంలో ఒక ప్రకటన విడుదల చేశారు.

రేస్ ఇకోతో గణేశ్ ఇకోస్పియర్ ఒప్పందం

బెంగళూరు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ, సర్క్యులర్ ఎకనమీలో పేరొందిన రేస్ ఇకో చెయిన్‌సంస్థ గణేశ్ ఇకోస్పియర్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. రెండుసంస్థలు సంయుక్తంగా పిఇటి ఫ్లెక్స్‌లను ఉత్పత్తి చేయదలిచింది. రేస్ ఇకో 51శాతం, గణేశ్ ఇకోస్పియర్ 49శాతం భాగస్వామ్యం ఉండేలా ఒప్పందం చేసుకున్నారు. అత్యధిక ప్లాస్టిక్ వ్యర్థాలు ఏర్పడే భారత్‌లో నియంత్రణ, సుస్థిరత లక్ష్యంగా రెండు సంస్థలు కలిపి ప్లాస్టిక్‌ను కనీసం 30శాతం పునః వినియోగం సాధించేలక్ష్యం పెట్టుకున్నట్టు ప్రకటించారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో ప్లాస్టిక్ ప్యాకేజింగ్‌లో 30శాతం ప్రగతి సాధించి 2028 నాటికి 60శాతానికి విస్తరింపచేలనే లక్ష్యంగా ఉంది. దేశవ్యాప్తంగా 30కు పైగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కేంద్రాలను రేస్‌ఇకో కలిగి ఉంది. గణేశ్ ఇకోస్పియర్ ప్లాస్టిక్ పునర్వినియోగంలో పేరొందిన సంస్థగా ఉంది. స్క్రాప్‌నుంచి బాటిల్ టు బాటిల్ గ్రేడ్ చిప్‌లను తయారీ రంగంలో 36ఏళ్ల అనుభం కలిగి ఉంది. ఏటా 1.96 లక్షల టన్నుల ప్లాస్టిక్‌ను పునర్వినియోగం సామర్థ్యం కలిగి ఉంది.

పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం డైరెక్టర్లకు అభినందన

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని నడుపినాయకనహళ్ళి గ్రామంలోని పాల ఉత్పత్తిదారుల సహకారసంఘానికి అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో తొలిసారి జేడీఎస్ వశమైంది. జేడీఎస్ మద్దతుదారుడి ఆనంద్ ఎన్‌వీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష, డైరెక్టర్‌లను ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ ప్రత్యకంగా సన్మానించి అభినందించారు. సంఘాన్ని ఉత్తమంగా తీర్చిదిద్దాలని డైరెక్టర్‌లకు సూచించారు. ఈ సందర్భంగా గంగిరెడ్డి, కెంపణ్ణ, రామచంద్ర, బయ్యమ్మ, గ్రామపెద్దలు రెడ్డెప్ప, లక్ష్మీపతి, నరసింహమూర్తి, జేడీఎస్ ప్రముఖులు ఉన్నారు.



సంఘం అధ్యక్షుడు, డైరెక్టర్లకు సన్మానం

బంగ్లాదేశ్ మహిళపై హత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

బెంగళూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్ మహిళపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని రామమూర్తినగర్ పోలీసులు అరెస్టు చేశారు. బాగల్కోటె జిల్లాకు చెందిన ముదుకణ్ణ అలియాస్ ఉపేంద్ర అలియాస్ దస్తగిర్ (30)ను మంగళవారం అరెస్టు చేశారు. నగరంలో వాటర్‌ట్యాంకర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఇతను సారాయిపాళ్య ప్రాంతంలో ఉన్నాడు. బంగ్లాదేశ్‌కు చెందిన ఓ కుటుంబం రామమూర్తినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కల్కెరెలో నివసిస్తోంది. ఆ కుటుంబానికి చెందిన మహిళ నజా (28) ఓ అపార్ట్‌మెంట్‌లో పనికి వెళ్లేవారు. ఇదే ప్రాంతంలో మదకణ్ణ ట్యాంకరు ద్వారా నీటిని సరఫరా చేసేవాడు. పనిమనిషిగా వెళ్లే మహిళను అతను చూశాడు. ఒకటి రెండుసార్లు పలకరించారు. జనవరి 22న పని ముగించుకుని నజా కల్కెరెలోని ఇంటికి వెళ్తుండగా అడ్డగించిన అతడు సమీపంలోని చెరువు ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత ఆమె ధరించిన చున్నీతోనే గొంతు నులిమి హతమార్చి మృతదేహాన్ని ఓ పొదలో పడేసి వెళ్లాడు. పనికి వెళ్లిన నజా రోజు గడిచినా రాకపోవడంతో భర్త స్థానిక రామమూర్తినగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజు మహిళ శవం వెలుగులోకి వచ్చింది. అత్యాచారానికి గురైనట్టు పోస్టుమార్టం నివేదిక ద్వారా తేలింది. పోలీసులు భర్తతోపాటు ఆమె సోదరుడిని విచారించారు. ఆమె మొబైల్‌లోనూ ఎటువంటి సమాచారం లభించలేదు. అయితే సంఘటన జరిగిన రోజు సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా డ్రైవర్‌పై అనుమానం వచ్చింది. ఈమేరకు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బహిరంగమైంది. ముదుకణ్ణను అరెస్టు చేసిన పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు.

నలుగురు జూదరుల అరెస్టు

ముళబాగిలు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): కోలారు జిల్లా ముళబాగిలు తాలూకాలోని సొన్నవాడి గ్రామంలోని ప్రభుత్వ స్థలంలో కొంతమంది పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్సై విఠల్ తళవార్ తెలిపారు. నాగరాజ్, ఆనంద్, రాజేశ్, హరీశ్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ.6,100 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఆడి, అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన శంకర్(29) గతంలో టీవీఎస్ ఫైనాన్స్ విభాగంలో పని చేసేవాడు. ఐదేళ్ల కిందట ఇతడికి స్రవంతి అనే యువతితో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. శంకర్ గత కొంతకాలంగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడేవాడు. ఈ క్రమంలో రూ.లక్షల్లో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు అధికం కావడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు.

లైనింగ్ అంటే సీమ రైతులకు ఉరితాడే


- హంద్రీనీవా కాలువ 10వేల క్యూసెక్కులకు పెంచాలి
- సీఎం దృష్టికి సీమ రైతుల పరిస్థితి
- ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ నిర్మాణం చేపట్టడం సీమ రైతులకు ఉరితాడు బిగించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయరాదని, కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకు ముఖ్య అతిథులుగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ రాయల సీమకు వరప్రదాయినిగా ఉన్న హంద్రీనీవాకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ వేయడం మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా, 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవాకు శ్రీశైలం డ్యాం నుంచి కనీసం 80 టీఎంసీల నీటిని కేటాయించాలని డిమాండ్ చేశారు. లైనింగ్ సమస్యను రాయల సీమ రైతుల తరపున సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీష్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వాన్ని మేలుకొలుపే నిరసన అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులైన హెచ్చెల్సీ, హంద్రీనీవాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని, వెంటనే లైనింగ్ పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలవ సామర్థ్యం పెంచి, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించి రైతులను ఆదుకోవాల న్నారు. అనంతరం హంద్రీనీవా సీనియర్ ఈఈ రాజా స్వరూప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు నాగరాజు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా సంఘం వెంకటలక్ష్మి, వృత్తిసంఘాల సమాఖ్య నాయకులు రామాంజనేయులు, సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, లింగమయ్య, పద్మావతి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1617.06	1,588.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10.137	442
నీటి నిల్వ (టీఎంసీలు)	53.47	9.74

పంచాయతీ ఎన్నికలపై
ముందస్తు సమావేశం

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తాలూకా, జిల్లాపంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో పార్టీ సంస్థాగత మహిళా కార్యకర్తల ప్రాథమిక సమావేశం నగరంలోని జిల్లా జేడీఎస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మీనళ్ళి తాయణ్ణ నేతృత్వంలో మంగళవారం జరిగింది. ఈసందర్భంగా జేడీఎస్ నాయకురాలు పుష్ప మాట్లాడుతూ తప్పుడు హామీలతో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. రాష్ట్రంలోని మహిళలకు రూ. 2000 అన్నభాగ్య పథకం కింద బియ్యం డబ్బు, 200యూనిట్ల ఉచిత విద్యుత్, నిరుద్యోగం వంటి హామీలను అటకెక్కించిందన్నారు. రాబోయే తాలూకా పంచాయతీ, జిల్లాపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా జమీలా బేగం, భవానీ రహమత్, జయలక్ష్మి, రుమా నా, రాజేశ్వరి, శివగంగ,వృందా, షబానా, నాగవేణి, నీలా, రేష్మ, రేణుక, భువనేశ్వర, రామమూర్తి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిన్నాపురం కొండల్లో మంటలు



కొండల్లో చెలరేగుతున్న మంటలు

కంప్లి, ఫిబ్రవరి 4(ఆంధ్ర జ్యోతి): తాలుకా పరిధిలోని మెట్రి గ్రామ పంచాయతీ చిన్నాపురం గ్రామం పక్కన వుండే కొండల్లో సోమవారం రాత్రి అకస్మికంగా మంటలు చెలరేగాయి. దీంతో సమీప ప్రాంత ప్రజలు భయభ్రాంతులయ్యారు. మంటల కారణంగా కొండల్లో వుండే ఎలుగుబంట్లు చిరుతలు, పక్షులు, వన్య జీవులు ఇబ్బందులు గురవుతున్నాయి. అటవీశాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే ఈ మంటకు కారకులపై చర్యలు తీసుకోవాలని చిన్నాపురం గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ధార్మిక కార్యక్రమాలతో
గ్రామాల్లో ప్రశాంతత: స్వామీజీ

కంప్లి, ఫిబ్రవరి 4(ఆంధ్ర జ్యోతి): గ్రామాల్లో, పట్టణంలో జరిగే ధార్మికసాంస్కృతిక కార్యక్రమాల వల్లనే ప్రశాంతత నెలకొంటుందని తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని సన్నాపురం గ్రామంలో వీరభద్రోత్సవం సందర్భంగా చిక్కినకొప్ప వీరశరణ పురాణ పఠనం గావించారు. ఈ సందర్భంగా రెంటు జంటలకు సామూహిక వివాహం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ స్వాములు మాట్లాడుతూ ప్రతి ఇంట్లో పిల్లలకు విద్యాభ్యాసం కల్పించాలన్నారు. సులేకల్ తాత ఈశ్వర తాత గవిసిద్దేశ్వర మహాస్వామి, మూకయ్యస్వామి, ఈశప్ప, మరి శంకరప్ప, చిక్కన్న, వీరనగౌడ, కుమారస్వామి, చెన్నప్ప శరణప్ప, రేణుకగౌడ తదితరులు పాల్గొన్నారు.

పనులు పూర్తయినా.. ప్రారంభించరా..?

● వాహనదారుల ఇబ్బందులు పట్టవా ? ● దుర్గమ్మగుడి అండర్‌పాస్ వద్ద బీజేపీ నిరసన



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

బళ్లారి సిటీ ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నగరంలోని దుర్గమ్మగుడి అండర్ పాస్‌లో మరమ్మతు పనులుపూర్తి అయినా వాహనాల రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించలేదని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం సాయంత్రం బీజేపీ ఎమ్మెల్సీ సతీష్, కార్పోరేటర్లు ఇబ్రహీంబాబు నేతృత్వంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అండర్‌బ్రిడ్జ్ పనులు ప్రారంబించి రెండు నెలలు గడిచిపోయాయి. పనులు పూర్తిఅయినా రాకపోకలు సాగించేందుకు వీలు కల్పించకుండా, బారికేడ్లు అడ్డంగా వేయడం సరికాదన్నారు. పనులు జరగుతున్నాయని ప్రజలను మభ్య పెడుతన్నారని ఎమ్మెల్సీ సతీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మిత కేంద్ర అధికారులతోపాటు నగరపాలిక అధికారులను ఈరోడ్డుపై ప్రజలు రాకపోకలు సాగించేందుకు బుధవారం ఉదయం వరకు గడువు ఇచ్చారు. బుధవారం ఉదయం 11గంటలలోపు ప్రజలు ప్రయాణించేందుకు అవకాశం కల్పించాలని, లేకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరిం చారు. ఇందుకు అధికారులు పనులు కొన సాగుతున్నాయని, విద్యుత్తు బల్బు సౌకర్యం కల్పించడానికి రోడ్డు పనులు ఆలస్యం అవుతుందని తెలిపారు. ఈ రోడ్డుపై రాజకీయం రగులుతోంది. సాయంత్రం పెద్దఎత్తున ఆందోళన చేపట్టడంతో పోలీసు బలగాలు అక్కడ మోహరించాయి. ధర్నా చేస్తున్నవారిని అక్కడి నుంచి పోలీసులు తరలించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గంగావతి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏపీఎంసీ సముదాయ భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పట్టణ విద్యార్థులు ప్రతిభ చాటారు. డ్రీమ్ వరల్డ్ మార్షల్ ఆర్ట్స్ కరాటే సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పట్టణానికి చెందిన ఎన్ఆర్‌సీబీ విద్యానగర పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా కరాటె పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను శిక్షకులు రవికుమార్, పాఠశాల పాలనాధికారి ఆశా కుష్టిగి, పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి అభినందించారు.

ఆస్తుల సర్వే తప్పనిసరి: కమిషనర్



ఇంటింటి సర్వేలో అధికారులు

సిరుగుప్ప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆస్తులు సర్వే తప్పనిసరి అని నగరసభ కమిషనర్ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం ఇంటింటి సర్వేలో ఆయన పాల్గొన్నారు. సిరుగుప్ప నగరసభకు సంబంధించి ప్రతి ఒక్కరూ ఇంటి స్థలాలు ఇళ్లను తప్పనిసరిగా రిజిస్టర్ చేసుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు సర్వే అధికారులు నగరసభ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు అన్ని వార్డులలో పర్యటించి ఆస్తుల సర్వే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్లు వెంకోబ, రాజాబక్షి, అనంత అధికారులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

● కేన్సర్‌పై ఆందోళన వద్దు ● సరైన సమయంలో గుర్తిస్తే చికిత్స సాధ్యం: డీహెచ్‌ఓ రమేష్ బాబు



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ రమేష్‌బాబు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పొగ తాగడం, పొగాకు, గుట్కా నమలడం, మద్యం సేవించడం తదితర చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి రమేష్‌బాబు సూచించారు. పపంచ కేన్సర్ నివారణ దినం సందర్భంగా జిల్లా యంత్రాంగం , జిల్లాపంచాయతీ, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖలు మంగళవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. జిల్లా ఆసుపత్రి ప్రాంగణం నుంచి నిర్వహించిన మార్చ్‌ను జెండా ఊపి ప్రారంబించి ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఓ మాట్లాడుతూ కేన్సర్లలో దాదాపు 10రకాలు ఉన్నాయన్నారు. చర్మకేన్సర్, రొమ్ముక్యాన్సర్, ఊపిరితిత్తుల కేన్సర్, ప్రోస్టేట్ కేన్సర్ తదితరాలున్నాయన్నారు. నోరు, గర్భాశయం, రొమ్ము క్యాన్సర్లు అధికంగా కనిపిస్తాయాన్నారు.

జిల్లాఅంటువ్యాధుల నియంత్రణ కార్యక్రమ అధికారి, జిల్లాసర్వేయర్ డాక్టర్ మరియంబి మాట్లాడుతూ.. ప్రపంచ కేన్సర్ నివారణ దినాన్ని తొలిసారిగా పారిస్‌లో ఫిబ్రవరి 4-2000న జరుపుకున్నారన్నారు. క్యాన్సర్ రోగుల్లో ఆత్మవిశ్వాసం నింపడమే లక్ష్యమని ఆయన అన్నారు. నేడు ఆధునిక జీవనశైలి కారణంగా, పొగాకు వాడకం వల్ల ప్రజలు అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా ఆసుపత్రిలోనే కీమోథెరపీ సౌకర్యాలు ప్రారంభిస్తామన్నారు. మార్చి నెలలో హోమ్ హెల్త్ కర్ణాటక కార్యక్రమం కింద ఇంటింటికీ సందర్శించి అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం నగర ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా సర్జన్ డాక్టర్ బసారెడ్డి, క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ విఘ్నేశ్, జిల్లా ఆర్సీహెచ్ డా. హనుమంతప్ప, జిల్లా క్షయనిర్మూలన అధికారి డాక్టర్ ఇంద్రాణి, జిల్లా కుటుంబ సంక్షేమ అమలు అధికారి పూర్ణిమ కట్టిమణి, జిల్లా కుష్టువ్యాధి నియంత్రణ వీరేంద్రకుమార్, డాక్టర్ అబ్దుల్లా, ఆరోగ్య విద్య అధికారి ఈశ్వర్ దాసప్పనవర్, విమ్స్ నర్సింగ్ విద్యార్థులు, జిల్లా సర్వేయర్ కార్యాలయ , కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల అధికారులు. ఆశా కార్యకర్తలు, నగర ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



పురసభ అధ్యక్షుడు బట్టాప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న కసాప సభ్యులు

భువనేశ్వరి సర్కిల్ ఏర్పాటు చేయాలని వినతి

కంప్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో భువనేశ్వరి సర్కిల్ ఏర్పాటు చేయాలని కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షులు షణ్ముఖ చిత్రగార్ కోరారు. మంగళవారం పురసభలో నూతన అధ్యక్షుడు బట్టా ప్రసాద్‌ను కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా చిత్రగార్ మాట్లాడుతూ పట్టణంలో ప్రతి దుకాణానికి కన్నడ భాష బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే కన్నడ సాహిత్య పరిషత్‌కు నూతన కట్టడాలకు ఒక స్థలం కేటాయించాలని కోరారు. నూతన అధ్యక్షుడు బట్ట ప్రసాద్ మాట్లాడుతూ.. త్వరలో జరిగే పురసభ సమావేశంలో సానుకూల నిర్ణయాలు తీసుకుంటా మన్నారు. అంబిగర మంజునాథ్, ఒండి దొడ్డ మంజునాథ, ఎస్టీ బసవరాజు, సిద్దప్ప,రామన్న, బ్రహ్మయ్య అన్నపూర్ణ, జిలాన్, అశోక్, కాళింగ వర్దన, విద్యాశంకర్ పాల్గొన్నారు.

నిధులు విడుదల చేయాలని ఆశాల నిరసన



నిరసన తెలుపుతున్న ఆశా కార్యకర్తలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా హొసపేటలో ఆశా వర్కర్లకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఎంసీఎస్ విడుదలైంది. ప్రోత్సాహక నిధుల విడుదలతో సహా అనేక డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏఐయూటీయూసీ అనుబంధంగా ఉన్న కర్ణాటక రాష్ట్ర యునైటెడ్ ఆశా వర్కర్స్ అసోసియేషన్ నిరసన ప్రదర్శన నిర్వహించింది.

మంగళవారం డీహెచ్‌ఓ కార్యాలయం సమీపంలో జరిగిన నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ. ఆశా వర్కర్ల సమస్యలకు పరిష్కారం కేవలం ఎండమావి మాత్రమేనన్నారు. ఏఎన్‌సీ, పీఎన్‌సీ, ఎంఆర్‌ఐ, వంటి అనేక ఇతర భాగాలను పోర్టల్ ద్వారా నింపినప్పటికీ, వాటి ధ్రువీకరణ కోసం చూపించడం లేదన్నారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఏ.శాంత, కార్యదర్శి గౌరమ్మ మాట్లాడుతూ.. వినతిని స్వీకరించిన డీహెచ్‌ఓ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. సాంకేతిక సమస్యల కారణంగా ఎంసీటీఎస్ ప్రోత్సాహక డబ్బులు అందలేదన్నారు. ఈసమస్య వారం రోజుల్లోపు సముచితంగా పరిష్కరిస్తామన్నారు. ఈసందర్భంగా సంఘం ఉపాధ్యక్షురాలు గౌరమ్మ, నాయకులు మహేశ్వరి, మంగళ, స్ఫూర్తి, చెన్నమ్మ పాల్గొన్నారు.

ఘనంగా సవితా మహర్షి జయంతి



సవితా మహర్షికి నివాళులర్పిస్తున్న ఏసీ ప్రమోద్, మేయర్ ముల్లంగి నందీశ్

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సవితా మహర్షి నేటి సమజానికి ఒక వెలుగు దీపం, వారి విలువలు, నమ్మకాలను అలవరచుకోవాలని నగర అసిస్టెంట్ కమిషనర్ ఏసీ. ప్రమోద్ అన్నారు. మంగళవారం పలు శాఖల ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరం హాల్లో నిర్వహించిన సవితా జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సవితా సమాజం అన్ని తరగతుల ప్రజలకు వివక్ష లేకుండా సేవలను అందిస్తుందన్నారు. ఈ సమాజం సామాజికంగా ,విద్యాపరంగా , ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ వృత్తిని గౌరవించి, విధేయత చూపినప్పుడు జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరన్నారు. సమాజ సోదరులు మహర్షి వచనాలను ఆచరించా లన్నారు. లెక్చరర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ పురాణాల ప్రకారం, కాశీ ప్రాంతంలో లభించే ఒక గొప్ప గ్రంథంలో సవితా మహర్షి అందరికీ ఆయుష్కర్మ సేవ చేస్తున్నట్లు ప్రస్తావించబడిందన్నారు. ఈ సందర్భంగా కన్నడ సాంస్కృతిక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నాగరాజ్, జిల్లా సవితా సమాజ్ సంఘం అధ్యక్షుడు సన్నగౌండ్ల రాకేశ్, సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఊరేగింపును మేయర్ ముల్లంగి నందీశ్ జెండా ఊపి ప్రారంభించారు.

కంప్లిలో..

కంప్లి : సవిత సమాజం వారి గురువులైన సవిత మహర్షిని ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ శివరాజ్ తెలిపారు. కంప్లి పట్టణంలో సవిత మహర్షి జయంతి సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సవిత సమాజం పదాధికారులు పాల్గొన్నారు



కంప్లిలో.. సవిత సమాజ సభ్యులు..

రాయచూరులో..

రాయచూరు : జిల్లాయంత్రాంగం, జిల్లా పంచాయతీ,నగరసభ, కన్నడ, సంస్కృతి శాఖ, జిల్లా సవితా సమాజం సంయుక్తాధ్వర్యంలో మంగళవారం సవితా మహర్షి జయంత్యుత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సవితా మహర్షి జయంతిని పురస్కరించుకుని స్థానిక శంకుచక్ర మారుతి ఆలయం వద్ద సవితా మహర్షి చిత్రపటానికి పూజలు ఆచరించి నగర ప్రధాన రహదారుల గుండా రంగమందిరం వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో ఈ సందర్భంగా సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటీల్, కే శాంతప్ప, బి.తిమ్మారెడ్డి, రామకృష్ణ, నరసరెడ్డి, డ్యాడి విరేశ్, రాఘవేంద్ర ఇటగి, వెంకటేశ్ వల్లూరులతో పాటు సమాజ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



రాయచూరులో ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్, సవితా సమాజ నాయకులు

హోసూరు జోన్

బాధ్యతలు చేపట్టిన కలెక్టర్



రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

హోసూరు(కృష్ణగిరి), ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆయన కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా రికార్డులను, లైసెన్స్‌లను జారీ చేసిన అన్ని రకాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంక, మోహన్‌దాస్ తదితర ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్‌ను పలువురు అధికారులు ఆత్మీయంగా స్వాగతించారు.

బాగలూరులో అన్నాడీఎంకే బహిరంగ సభ



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి

హోసూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు సమీపంలోని బాగలూరులో అన్నాడీఎంకే ఆధ్వర్యంల్లో ఎంజీఆర్ 108వ జయంతి బహిరంగ సభ జరిగింది, హోసూరు నార్త్ యూనియన్ కార్యదర్శి రవికుమార్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కృష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, సంస్థ కార్యదర్శి రాములు పాల్గొని మాట్లాడారు. ఎంజీఆర్ సాధనలపై ప్రసంగించారు. కార్యక్రమంలో డ్రైవర్ టీమ్ జిల్లా కార్యదర్శి చెన్నకృష్ణన్, ఎంజీఆర్ ఫోరం జిల్లా సంయుక్త కార్యదర్శి జై ప్రకాశ్, పారిశ్రామిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్, హోసూరు యూనియన్ కమిటీ మాజీ అధ్యక్షుడు శశివెంకటస్వామి, హోసూరు సర్కిల్ కార్యదర్శులు హేమకుమార్, కుబేరన్ శంకర్, రఘుమాన్, యూనియన్ ఉప కర్యదర్శి రమేశ్, జిల్లా సంయుక్త కార్యదర్శి అలమేలు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన ర్యాలీ

హోసూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నగరంలో మాదకద్రవ్యాల వాడకంతో కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ వాటి నియంత్రణకై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కృష్ణగిరి జిల్లా ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, హోసూరు డివిజనల్ ప్రొహిబిషన్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, హోసూరు మీరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, లయన్స్ క్లబ్ ఆఫ్ హోసూరు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. హోసూరులోని రాయకోట రోడ్డు మీదుగా ముల్లైనగర్‌కు వెళ్లి మీరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కాంప్లెక్స్ సమీపాన ర్యాలీ ముగిసింది. ఏఎస్పీ అక్షయ్ అనిల్ వాక్రే, కృష్ణగిరి జిల్లా లిక్కర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డీఎస్పీ సింధియా, జిల్లా విద్యాశాఖధికారులు మునిరాజు, ప్రభుత్వ పాఠశాలలు, గోపాలప్ప, మీరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మెన్ సీనియర్ షణ్ముగవేల్, లయన్స్ క్లబ్ అసోసియేషన్ అధ్యక్షుడు సెందిల్‌కుమార్, ప్రసూతి వైద్య నిపుణులు అంబికా జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. హోసూరు టౌన్ ఇన్‌స్పెర్ నాగరాజు, ట్రాఫిక్ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ సత్య, ప్రదానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అసోసియేషన్ ప్రెసిడెంట్ మహేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బోరుబావిని ప్రారంభించిన ఎమ్మెల్యే

హోసూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హోసూరు నియోజకవర్గం పంచాయతీ యూనియన్ పలవనపల్లి పంచాయతీ మావత్తూరు బోరుబావిని ప్రారంభించారు. గ్రామస్థుల డిమాండ్ మేరకు శాసనసభ్యుని అభివృద్ధి నిధి నుంచి సుమారు రూ.3.70 లక్షలతో మోటారు, పైప్‌లైన్, ప్యానెల్‌బోర్డ్, కేబుల్ వైర్ ఏర్పాటు చేశారు. బోరును ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంచనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో శూళగిరి ఉత్తర యూనియన్ కార్యదర్శి నాగేశ్, యూనియన్ ఉప కార్యదర్శి రమేశ్, కారపల్లి శ్రీనివాస్, కుమరేశన్, విజయతోపాటు డీఎంకే నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్యానెల్‌బోర్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వై ప్రకాశ్